నేలకొరిగిన మొక్కజొన్న, వరి, మామిడి


లక్ష్మీదేవిపల్లిలో నేల రాలిన మామిడి కాయలు


రాయికల్‌లో నేలకొరిగిన మొక్కజొన్న పంట

సారంగాపూర్: సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో శుక్రవారం రాత్రి ఈదురు గాలులతో కూడిన వర్షానికి పలు గ్రామాల్లో మామిడి నేల రాలగా, మొక్కజొన్న పంట నేలకొరిగింది. పలువురు రైతుల వరి పొలాలు సైతం నేలవాలాయి. శుక్రవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసినప్పటికీ పంటలపై పెద్దగా ప్రభావం చూపలేదు. రాత్రి ఎనిమిది గంటల సమయంలో భారీగా కురిసిన వర్షంతో పంటలకు నష్టం వాటిల్లింది. ప్రభుత్వం నష్టపోయిన రైతులను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

నేలకొరిగిన వరి

రాయికల్: పట్టణంతో పాటు మండలంలోని 32 గ్రామాల్లో శుక్రవారం అర్ధరాత్రి కురిసిన వర్షానికి వరిపంట నేలకొరగగా, మామిడికాయలు నేల రాలాయి. దీంతో రైతులు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘ నాయకులు కోరుతున్నారు.

పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి


పంటలను పరిశీలిస్తున్న మాజీ జెడ్పీచైర్ పర్సన్

జగిత్యాలరూరల్:/సారంగాపూర్: అకాల వర్షంతో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. శనివారం జగిత్యాల రూరల్ మండలం హైదర్‌పలి, సారంగాపూర్ మండలంలోని లక్ష్మీదేవిపల్లిలో అకాల వర్షాలకు నష్టపోయిన మొక్కజొన్న నేల రాలిన మామిడి, ఇతర పంటలను శనివారం పరిశీలించి మాట్లాడారు. రైతులపై రాష్ట్ర ప్రభుత్వం, ప్రకృతి రెండూ పగబట్టాయని, ప్రభుత్వం వెంటనే పంటనష్టాన్ని అంచనా వేసి రైతులకు నష్టపరిహారం అందించి రైతులను ఆదుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఫసల్ బీమా యోజన పథకాన్ని సక్రమంగా అమలు చేయాలని, మండలాన్ని కేంద్రంగా కాకుండా గ్రామాన్ని కేంద్రంగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ మహిపాల్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ కొల్ముల రమణ, విండో మాజీ చైర్మన్ సాగి సత్యంరావు, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు తేలు రాజు, నాయకులు అంజన్న, గంగారెడ్డి, సత్యంరావు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం జరిగేలా చూస్తాం

బుగ్గారం: అకాల వర్షానికి మండలంలోని వివిధ గ్రామాల్లో దెబ్బతిన్న వరి,మొక్కజొన్న,మామిడి పంటల వివరాలను ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని బుగ్గారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వేముల సుభాష్ అన్నారు. ఈ మేరకు శనివారం ఉదయం స్థానిక రైతులతో కలిసి వివిధ గ్రామాలలో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు నగునూరి నర్సాగౌడ్,సిగిరి అంజిత్,తాడెపు లింగన్న,దసర్తి పోషన్న, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

మల్లాపూర్: గ్రామాల్లో అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ నాయకుడు రొండ్ల రాజిరెడ్డి అన్నారు. శనివారం మల్లాపూర్ మండలంలోని పాతదాంరాజుపల్లిలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో చేపట్టిన సీసీరోడ్లు నిర్మాణ పనులను స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి పరిశీలించారు. ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి పనులతో గ్రామాల్లో ప్రగతిని సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమేష్, ఫీల్డ్ అసిస్టెంట్ నరేశ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ప్రజల రక్షణ కోసమే సీసీ కెమెరాలు ఏర్పాటు


సీసీ కెమెరాలు ప్రారంభిస్తున్న సీఐ రాంనర్సింహారెడ్డి

ధర్మపురి: ప్రజల రక్షణ కోసమే సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ధర్మపురి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాంనర్సింహారెడ్డి అన్నారు. మండలంలోని నేరెల్ల సాంబశివ ఆలయంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ప్రారంభోత్సవానికి సీఐ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామాల్లో, ప్రార్థనా మందిరాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఏ మూలన ఏం జరుగుతుందో, గ్రామంలోకి కొత్త వ్యక్తులు సంచరించి ఏదైనా అరాచకాలకు పాల్పడిన సీసీ కెమెరాల ద్వారా గుర్తించవచ్చన్నారు. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమన్నారు. కార్యక్రమంలో ఎస్సై ఉదయ్‌కుమార్, ఆలయ కమిటీ చైర్మన్ జాజాల రవీందర్ పాల్గొన్నారు.

చలి వేంద్రం ప్రారంభం

మల్యాల: మండలంలోని ఎక్స్‌రోడ్డు వద్ద ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని ఎస్సై నరేశ్ శనివారం ప్రారంభించారు. వేసవిలో ప్రజలు, ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు ఆటో యూనియన్ వారు చలి వేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో ఎస్సై వారిని అభినందించారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షుడు ఈటూరి జలందర్, తుంగపల్లి లక్ష్మన్, ఎనుగందుల సుధాకర్, ఇందూరి విలాస్ పాల్గొన్నారు.

పంటల పరిశీలన


మామిడి కాయలను పరిశీలిస్తున్న అధికారులు

పెగడపల్లి:మండలంలో శుక్రవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు కురిసిన అకాల వర్షానికి దెబ్బతిన్న పంటలను శనివారం అధికారులు పరిశీలించారు. మండలంలోని పలు గ్రామాల్లో అధికారులు పర్యటించి మామిడి తోటలు, మొక్కజొన్న, వరిపైర్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పంటల నష్టంపై రైతు వారిగా వివరాలు సేకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్, ఏవో శ్రీకాంత్, ఆర్ఐ శ్రీనివాస్, ఏఈవోలు, కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

బుగ్గారం: మండలంలోని వివిధ గ్రామాల్లో కురిసిన అకాల వర్షానికి మొక్కజొన్న,వరి పంటలు దెబ్బతిన్నాయి. వ్యవసాయ అధికారులు స్థానిక రైతులతో కలిసి శనివారం దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. మండల ఏవో అక్షిత, ఏఈవోలు శ్రీనివాస్,నవీద్ కలిసి నష్టానికి సంబంధించిన ప్రాథమిక నివేదికను సిద్ధం చేశారు. ఈ నివేదికను ఉన్నతాధికారులకు పంపించనున్నట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. మండలంలో వరి పదెకరాలు, మొక్కజొన్న 250 ఎకరాల వరకు నష్టం జరిగినట్లు తెలిపారు.

ఎన్‌హెచ్‌ఆర్సీ మండల అధ్యక్షుడిగా రాజేశం

కథలాపూర్: నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ(ఎన్‌హెచ్‌ఆర్సీ) కథలాపూర్ మండల అధ్యక్షుడిగా ఇప్పపెల్లి గ్రామానికి చెందిన గండి రాజేశంను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు మొగుళ్ల భద్రయ్య, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉపాధ్యక్షుడిగా మల్యాల ప్రశాంత్, ప్రధాన కార్యదర్శిగా బుర్ర మనోజ్‌కుమార్, సంయుక్త కార్యదర్శిగా మర్రిపెల్లి గణేశ్, కార్యదర్శిగా గాంధారి నితీన్‌ను నియమించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కేటీఆర్ పర్యటన విజయవంతం చేయాలి


బీఆర్ఎస్ శ్రేణులతో సమావేశమైన రవిశంకర్

మల్యాల: కరీంనగర్ జిల్లాలో కేంద్రంలో ఆదివారం జరిగే కేటీఆర్ పర్యటన విజయవంతం చేయాలని చొప్పదండి ఎమ్మెల్యే సుంకరి రవిశంకర్ పిలుపునిచ్చారు. మల్యాలలోని ఓ ఫంక్షన్‌హాల్లో శనివారం కార్యకర్తలతో జరిగిన సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ రజతోత్సవ సమావేశానికి మండలం అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. అనంతరం మండలంలోని రాజారాం గ్రామానికి చెందిన శివరాత్రి లక్ష్మీరాజం, శివరాత్రి వెంకటి, పాతారం గ్రామంలో నిమ్మల మల్లయ్య కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రామ్మో హన్‌రావు, ప్యాక్స్ చైర్మన్లు మధుసూదన్ రావు, సాగర్‌రావు, మాజీ సర్పంచులు బద్దం తిరుపతిరెడ్డి, అశోక్, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు అప్రజాస్వామికం

గొల్లపల్లి: అక్రమ అరెస్టులు అప్రజాస్వామికమని బీఆర్ఎస్వీ నాయకులు అన్నారు. అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న నేపథ్యంలో బీఆర్ఎస్వీ నాయకులను శనివారం ముందస్తుగా అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజాసమస్యలను ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నేతలను అరెస్టు చేస్తూ రాచరిక పాలన కొనసాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ మండల అధ్యక్షుడు ఆవారి చందు, నాయకులు బొడ్ల గంగాధర్, శ్రీనివాస్, ఆవుల సాయి, దత్తాత్రి పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ జల దినోత్సవం


నీటి పొదుపు ప్రయోగం ప్రదర్శిస్తున్న విద్యార్థులు

పెగడపల్లి: మండలంలోని నంచర్ల ప్రాథమిక పాఠశాలలో శనివారం ప్రపంచ జల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం సుబ్బారావు, ఉపాధ్యాయులు మాట్లాడుతూ తాగునీటి ప్రాముఖ్యత దాని సంరక్షణపై చిన్నప్పటి నుంచే బాధ్యత వహించాలని విద్యార్థులకు సూచించారు. అదే విధంగా నీటి కాలుష్యానికి కారణమయ్యే వాటిని నిషేధించడం, వైవిధ్య రక్షణ వంటి అంశాలపై విద్యార్థులకు ఆయన అవగాహన కల్పించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రశంసించి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుబ్బారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మల్లాపూర్ టూ కొండగట్టు భక్తుల పాదయాత్ర


కొండగట్టు చేరుకున్న హనుమాన్ భక్తులు

మల్లాపూర్ : మల్లాపూర్ మండల కేంద్రం నుంచి కొండగట్టు శ్రీ అంజనేయస్వామి ఆలయం వరకు కాలినడకన వెళ్లి స్వామి వారిని దర్శించుకునేందుకు హనుమాన్‌దీక్ష గురుస్వాములు తరలివెళ్లారు. శనివారం ఉదయం కొండగట్టు శ్రీ అంజనేయ స్వామి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు మల్లాపూర్‌లోని స్థానిక హనుమాన్ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చింతలూరి రంజిత్, లవంగ శివకుమార్, ముష్కరి సంతోష్, మొరపు జలపతి తదితరులు తరలివెళ్లారు.

ఆలయాల్లో హనుమాన్ భక్తుల పూజలు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో శనివారం హనుమాన్ భక్తులు ప్రత్యేకపూజలు చేశారు. పలువురు హనుమాన్ భక్తులకు ఆలయ పూజారి మాలధారణ చేశారు. అనంతరం ఆలయాల్లో స్వామివార్లను దర్శించుకున్నారు.

మహిళ మృతిపై వైద్యాధికారుల విచారణ

జగిత్యాల: జగిత్యాలకు చెందిన శ్రీనివాస్ భార్య అరుణను విద్యానగర్‌లోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. అక్కడ పరీక్షించిన వైద్యులు శస్త్ర చికిత్స చేశారు. చికిత్స అనంతరం అపస్మారకస్థితికి చేరడంతో మరో ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి కరీంనగర్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందిన విషయం తెల్సిందే. ఈ క్రమంలో ఆస్పత్రిపై కేసు నమోదు కాగా, శనివారం విచారణ బృందం డాక్టర్ శ్రీనివాస్, అర్చన ఆధ్వర్యంలో మోతె అర్బన్ సెంటర్‌లో మృతురాలి భర్తతోపాటు, మరికొంత మందిని పిలిచి విచారణ చేపట్టారు. పూర్తిస్థాయిలో తెలుసుకుంటున్నామని డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు.

విద్యుత్ వినియోగదారుల ఫోరంతో సమస్యలు పరిష్కారం

జగిత్యాలజోన్: విద్యుత్ వినియోగదారుల ఫోరంతో విద్యుత్ సమస్యలకు ఎప్పటికప్పుడు పరిష్కారం లభిస్తుందని ఎన్పీడీసీఎల్ సీజీఆర్‌ఎఫ్-2 చైర్మన్ ఎరుకల నారాయణ అన్నారు. జిల్లా విద్యుత్ శాఖ కార్యాలయంలో విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక శనివారం నిర్వహించారు. రైతులు తప్పనిసరిగా విద్యుత్ కెపాసిటర్లు అమర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఫోరం సభ్యులు రామకృష్ణ, లకావత్ కిషన్, మర్రిపల్లి రాజాగౌడ్, జగిత్యాల ఎస్‌ఈ శాలియానాయక్, ఏడీఈ జవహర్‌లాల్ నాయక్, ఏఈలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ రజతోత్సవం విజయవంతం చేయాలి

పెగడపల్లి: కరీంనగర్‌లో ఆదివారం నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవాన్ని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లోక మల్లారెడ్డి అన్నారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవుతున్నారని, మండలం నుంచి భారీ సంఖ్యలో పార్టీ శ్రేణులు, అభిమానులు తరలిరావాలని కోరారు.

క్లుప్తంగా

ఆలయం ఎదుట పొంగి పొర్లిన డ్రైనేజీ


ఆలయం ఎదుట పారుతున్న డ్రైనేజీ నీరు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ముందు చిన్న పాటి వర్షానికి డ్రైయినేజీ పొంగి పొర్లింది. శనివారం ఉదయం డ్రైయినేజీ నీరంగా రోడ్డుపైకి చేరడంతో చెరవును తలపించి ఆ ప్రాంతమంతా దుర్గంధం వెదజల్లింది. ఆలయం ముందున్న చిరువ్యాపారులు, దర్శనం కోసం వచ్చే భక్తులు ఆలయానికి వెళ్లేందుకు ఇబ్బందులు పడ్డారు. విషయం తెలిసిన వెంటనే మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి ట్యాంకర్ ద్వారా నీటిని పైపుల ద్వారా తొలగించారు. ఈసమస్యల శాశ్వత పరిష్కారం చూపించాలని కోరారు.

ఎస్సీ,బీసీ బిల్లులకు చట్టబద్ధత కల్పించాలి


నివాళి అర్పిస్తున్న నాయకులు

బుగ్గారం: అసెంబ్లీలో ఆమోదం పొందిన ఎస్సీ వర్గీకరణ బిల్లు, బీసీ బిల్లులకు పార్లమెంట్‌లో చట్టబద్ధత కల్పించాలని అంబేడ్కర్ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పార్లమెంటులో చట్టబద్ధత కల్పించడంతోనే బిల్లులకు రక్షణ చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు దూడ తిరుపతి,దూడ లక్ష్మణ్,నక్క రాజేందర్,పోషరాజు,విష్ణు,జస్వంత్, వెంకటేశ్, తిరుపతి, ప్రశాంత్, అంజి,అనిల్,కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి


గర్భిణులకు సీమంతం చేస్తున్న సూపర్‌వైజర్

జగిత్యాలరూరల్: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజశ్రీ అన్నారు. శనివారం జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్-1 అంగన్‌వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసం, సీమంతం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గర్భిణులు సహజంగా తీసుకునే ఆహారం కంటే అదనంగా పోషకాలు ఉన్న ఆహారం తీసుకోవాలన్నారు. పండ్లు, కూరగాయలు ఎక్కువ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సునీత, జలజ, జయప్రధ, పద్మజ, రాజమణి తదితరులు పాల్గొన్నారు.

31 లోగా ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించాలి


ప్రొసీడింగ్ అందిస్తున్న కమిషనర్

ధర్మపురి: ఈనెల 31 లోగా ఎల్‌ఆర్‌ఎస్ ఫీజులను చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ రానున్న రోజుల్లో ఎంతో ఉపయోగ కరంగా ఉంటుందని ఎల్‌ఆర్‌ఎస్‌ను కట్టి 25 శాతం రాయితీ పొందవచ్చని పేర్కొన్నారు. ధర్మపురికి చెందిన పెండ్యాల బాలకృష్ణ మొట్ట మొదటగా ఎల్‌ఆర్‌ఎస్ చెల్లించగా, ప్రొసీడింగ్ కాపీని అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ గంగాధర్, వార్డు ఆఫీసర్ పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రొడక్ట్ మేకింగ్ నేర్చుకోవాలి

జగిత్యాల: విద్యార్థులు ప్రొడక్ట్ మేకింగ్ నేర్చుకోవాలని, దీంతో యువతకు ఉపాధి కలుగుతుందని జ్యోతి హైస్కూల్ డైరెక్టర్ హరిచరణ్‌రావు అన్నారు. శనివారం ఇన్నోవేటర్ వైజ్ఞానిక ప్రదర్శనలో ఎల్‌ఈడీ బల్బులు తయారు చేయడంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పీఎం నరేంద్రమోదీ పిలుపు మేరకు విద్యార్థులు ప్రొడక్ట్ మేకింగ్ నేర్చుకోవాలని, దీంతో నిరుద్యోగ సమస్య తీరుతుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ది యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ వర్క్‌షాప్‌కు స్ఫూర్తినిచ్చిందన్నారు. శనివారం నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఎల్‌ఈడీ బల్బులు ఏ విధంగా తయారుచేస్తారో చూపించారు. కార్యక్రమంలో మానికరావు పాల్గొన్నారు.

గుంత పూడ్చేదెప్పుడో..?



రాయికల్: పట్టణంలోని వీరాపూర్ క్రాసింగ్ రోడ్‌లోని మున్సిపల్ సిబ్బంది నెల రోజుల క్రితం మురికికాలువ తొలగించేందుకు కల్వర్టును తవ్వడంతో గుంత ఏర్పడింది. అయితే దీనిని పూడ్చడం మరిచిపోయారు. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయని కాలనీవాసులు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కరించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి:మనోహర్ గౌడ్, మున్సిపల్ కమిషనర్, రాయికల్, సెల్‌ఫోన్ నంబర్: 8919777985

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

ఎల్‌ఆర్‌ఎస్, ఇంటి పన్ను వసూళ్లపై దృష్టి సారించాలి


అధికారులతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్

కథలాపూర్: గ్రామాల్లో ఎల్‌ఆర్‌ఎస్, ఇంటిపన్ను వసూళ్లపై అధికారులు దృష్టి సారించాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత అన్నారు. మండలంలోని సిరికొండలో శనివారం ఆమె పర్యటించారు. ఇంటి పన్ను వసూలు తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ నెలాఖరులోగా ఇంటిపన్ను వందశాతం పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం గ్రామశివారులో ఉన్న రెండు రైస్‌మిల్లులను తనిఖీచేసి నిబంధనల మేరకు బియ్యంను ప్రభుత్వానికి అప్పగించాలని నిర్వాహకులను ఆదేశించారు. ఆమె వెంట తహసీల్దార్ వినోద్, ఎంపీడీవో శంకర్, ఎంపీవో రాజశేఖర్, ఆర్ఐ నగేశ్, కార్యదర్శి నర్సారెడ్డి ఉన్నారు.

రైతు సమస్యల పరిష్కారానికే చలో అసెంబ్లీ


రైతులతో మాట్లాడుతున్న తిరుపతిరెడ్డి

జగిత్యాలఅగ్రికల్చర్: రైతు సమస్యల పరిష్కారం కోసమే మార్చి 24 న చలో అసెంబ్లీ నిర్వహిస్తున్నామని రైతు ఐక్యవేదిక రాష్ట్ర నాయకుడు తిరుపతిరెడ్డి అన్నారు. జగిత్యాల రూరల్ మండలం మోరపల్లి, మేడిపల్లి మండలంలోని తొంబరావుపేట, పోరుమల్ల, కట్లకుంట్ల గ్రామాల్లో చలో అసెంబ్లీ కార్యక్రమంపై రైతులను చైతన్యం చేసే కార్యక్రమాల్లో శనివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు ఓట్ల కోసం రైతులను వాడుకుంటున్నాయే తప్ప రైతులకు చేసిందేమీ లేదన్నారు. రైతే దేశానికి వెన్నుముఖ అంటూ అనేక పథకాలు ప్రవేశపెడుతున్నప్పటికీ ఆ పథకాలు క్షేత్రస్థాయికి చేరక నిర్వీర్యమవుతున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం పసుపు పంటకు మద్దతు ధర ప్రకటించకపోవడంతో రైతులకు ఒరిగిందేమీ లేదన్నారు. కార్యక్రమంలో రైతు నాయకులు కోల నారాయణ, బందెల మల్లయ్య, సాయిరెడ్డి, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

ఆయిల్‌పాం సాగుపై రైతులకు అవగాహన


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో ముక్తేశ్వర్

రాయికల్: మండలంలోని రామాజీపేటలో ఆయిల్ పాం సాగుపై వ్యవసాయ, ఉద్యానవన శాఖల ఆధ్వర్యంలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో ముక్తేశ్వర్ మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం నుంచి సబ్సిడీ అందిస్తోందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఈవోలు పద్మావతి, రైతు నాయకులు రాజేశ్, మహేశ్, మల్లారెడ్డి, రమాపతిరావు, లచ్చయ్య, శంకర్ పాల్గొన్నారు.

మల్యాల: మండలంలోని మద్దుట్లలో ఆయిల్ పాం సాగుపై శనివారం రైతులకు అవగాహన కల్పించారు. సన్నకారు, చిన్నకారు రైతులకు 90 శాతం, ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం రాయితీపై డ్రిప్ పరికారలు అందిస్తున్నామని అధికారులు తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులు మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఆయిల్‌పాం సాగు పద్ధతులు, ప్రయోజనాలు, దిగుబడులు తదితర యాజమన్య పద్ధతులపై వివరించారు. ఏవో చంద్రదీపక్, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

వృద్ధురాలి అదృశ్యం


సరోజన

జగిత్యాలక్రైం: జగిత్యాల కొత్తబస్టాండ్‌లో ఎలగందుల సరోజన అనే వృద్ధురాలు శుక్రవారం మధ్యాహ్నం అదృశ్యమైనట్లు పట్టణ ఎస్సై మన్మధరావు తెలిపారు. కోరుట్ల పట్టణానికి చెందిన సరోజన శుక్రవారం ఉదయం జగిత్యాల కొత్త బస్టాండ్‌లో బస్సు దిగి అదృశ్యమైంది. దీంతో ఆమె కుమారుడు ఎలగందుల శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పిడుగుపాటుకు పాడి గేదె మృతి

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం హైదర్‌పల్లి గ్రామానికి చెందిన పర్స వెంకటికి చెందిన పాడిగేదె శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షంలో పిడుగు పడటంతో పాడిగేదె అక్కడికక్కడే మృతిచెందింది. పాడి గేదె విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని బాధిత రైతు తెలపారు.

దళితుడిపై దాడిచేసిన వారిని శిక్షించాలి

జగిత్యాలరూరల్: దళితునిపై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కమిటీ మెంబర్ కుర్సెంగ వేణు అన్నారు. జగిత్యాల రూరల్ మండలం బాలపల్లి గ్రామానికి చెందిన దళితుడు బాసమల్ల గంగాధర్‌ను అదే గ్రామానికి చెందిన గుంటి మహేశ్ దాడిచేసి గాయపర్చగా ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితుడిపై దాడిచేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసిన పోలీసులు వెంటనే అతన్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించాలని కోరారు.కార్యక్రమంలో నక్క అశోక్, మారుతి, మల్లేశం, గంగమల్లయ్య, బోదనపు పుష్పలత తదితరులు పాల్గొన్నారు.